సాక్షి
వనపర్తి
ఆదివారం ׀ 7 ׀ సెప్టెంబర్ ׀ 2025



యథేచ్ఛగా వసూళ్లు!

ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

-8లో ▸



బ్యాడ్మింటన్ పోటీలు

మహబూబ్‌నగర్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతోంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9/21.9

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గణపతి లడ్డు @ రూ.8,00,116



వనపర్తి: జిల్లాకేంద్రంలోని రాజమహల్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి నిమజ్జనం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. అంతకుముందు లడ్డుకు వేలం నిర్వహించారు. పదకొండు రోజుల పాటు వినాయకుడితో పాటు పూజలందుకున్న లడ్డును రాజస్థాన్‌కు చెందిన బంగారు వ్యాపారి సమధాన్ రూ.8,00,116కు వేలంలో దక్కించుకున్నారు. జిల్లాలో ఇంత పెద్దమొత్తంలో వినాయకుడి లడ్డు వేలం పాట పాడటం ఇదే ప్రథమమని స్థానికులు చర్చించుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ వార్త చక్కర్లు కొడుతోంది.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి రూరల్: జిల్లాలోని పెద్దగూడెం శివారు ఎంజీపీ, టీబీసీ, డబ్ల్యూఆర్ బీఎస్సీ (హానర్స్) వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ ఇంజినీరింగ్, ప్లాంట్ పాథాలజీ బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎంటెక్‌లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణులైన వారు అర్హులని.. పీహెచ్‌డీ, నెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల నిజ ధ్రువపత్రాలు, ఒక సెట్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పూర్తి బయోడేటాతో ఈ నెల 10న పెద్దగూడెం శివారు వ్యవసాయ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

'ఏఈఓలకు పనిభారం తగ్గించాలి'

వనపర్తి రూరల్: తమపై పని భారం తగ్గించాలంటూ శనివారం కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని ఏఈఓలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఏఈఓలు మాట్లాడుతూ.. పని ఒత్తిడి కారణంగా కామారెడ్డి జిల్లా డోగ్లీ మండల ఏఈఓ బస్వరాజు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడన్నారు. ఈ సందర్భంగా అతడి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులర్పించారు. డిజిటల్ క్రాప్ సర్వేతో పాటు 49 రకాల విధులు నిర్వర్తిస్తుండటంతో పని ఒత్తిడి పెరిగి రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పని భారం తగ్గించాలని, తగిన సమయం ఇవ్వాలని కోరారు. మృతిచెందిన ఏఈఓ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈఓలు నందకిశోర్, యుగంధర్, మోహన్, సాయిరెడ్డి, అభిలాష్, సంతోష్, శైలజ, కవిత, హరితారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులే దేశానికి వనరులు

కొత్తకోట రూరల్: విద్యార్థులు దేశానికి అపార వనరులని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి అన్నారు. 2025 సంవత్సరానికిగాను తెలంగాణ ప్రభుత్వం అందించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మోజర్ల ఉద్యాన కళాశాల అధ్యాపకులు డా. షహనాజ్ అందుకున్న సందర్భంగా కళాశాలలో అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన గుణాత్మక విద్య అందించేందుకు ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. మెరుగైన ఆవిష్కరణలతో రాష్ట్రంలోని ఉద్యాన రైతులు పంటల సాగు లాభసాటిగా మార్చేందుకు ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు.

ఆగుతూ.. సాగుతూ...!

జిల్లాలో నత్తనడకన విద్యార్థుల వివరాల నమోదు



జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్ (ఫైల్)

- ఏజెన్సీకి అప్పగింత.. పాఠశాలల్లోనే ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు
- పూర్తిస్థాయి నమోదే లక్ష్యంగా ముందుకు..
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆలస్యం

వనపర్తి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ విధానంతో విద్యార్థుల సంఖ్య పక్కాగా నిర్ధారణ అవుతుందని భావించిన ప్రభుత్వం ఈ మేరకు జిల్లాలో ఆధార్ నమోదు, బయోమెట్రిక్ వేగవంతం చేసేందుకు ఎస్ఎన్ఆర్ ఏజెన్సీతో రాష్ట్ర ఉన్నతాధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఏజెన్సీ ప్రతి మండలానికి ఒకటి, పెద్ద మండలాలకు 2, 3 చొప్పున ఆపరేటర్లను నియమించి ఆయా మండలాల్లో ప్రధాన పాఠశాల సమీపంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి సమీప ప్రాంత విద్యార్థుల వివరాలు నమోదు చేయనున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో ఏజెన్సీ ఆపరేటర్లు విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, వేలిముద్రలు, ఆధార్ నంబర్, తరగతి, పుట్టిన తేదీ, ఫోన్‌నంబర్, ఐరీష్ తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి ఆపరేటర్ రోజు సగటున 30 మంది విద్యార్థుల వివరాలు బయోమెట్రిక్ యంత్రంలో నమోదు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలను ఆపరేటర్లే నమోదు చేసేలా ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం కొన్ని మండలాల్లో వివరాల నమోదు కొనసాగుతుండగా.. మరికొన్ని మండలాల్లో ప్రారంభించాల్సి ఉంది.

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 754 ఉండగా.. 91,830 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 5,537 మంది విద్యార్థులకు ఆధార్ నమోదు లేకపోవడం గమనార్హం. ఇందులో వనపర్తిలో 1,253, శ్రీరంగాపురంలో 174, ఆత్మకూర్‌లో 813, పెబ్బేరులో 667, వీపనగండ్లలో 121, పానగల్‌లో 245, కొత్తకోటలో 723, చిన్నంబావిలో 149, అమరచింతలో 270, గోపాల్‌పేటలో 226, మదనాపురంలో 195, పెద్దమందడిలో 276, రేవల్లిలో 108, ఖిల్లాఘనపురంలో 247, ఏదులలో 70 మంది విద్యార్థులు ఉన్నారు. అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లో ఆధార్‌కు అనుగుణంగా 25,608 మంది విద్యార్థుల వివరాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆధార్, బయోమెట్రిక్, ఐరిష్ పూర్తిస్థాయిలో అనుసంధానం కాని విద్యార్థులు 5,843 మంది ఉన్నారు. పూర్తిస్థాయిలో అప్‌డేట్ అయిన విద్యార్థులు 54,844 మంది మాత్రమే ఉన్నారు. విద్యార్థి పేరు, ఆధార్‌తో పూర్తిస్థాయిలో మ్యాచ్ అయిన విద్యార్థులు 69,726 మంది మాత్రమే ఉన్నారు.

కచ్చితంగా నమోదు..



"విద్యార్థులకు తప్పనిసరిగా ఆధార్ గుర్తింపు ఉండాలి. ఆధార్ ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా బయోమెట్రిక్ నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం కొన్ని మండలాల్లో ఆధార్ సేవలను విద్యార్థులకు చేరువ చేశాం. త్వరలోనే అన్ని మండలాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందిస్తాం. డీఈఓ ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. – శ్రీధర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి

మందకొడిగా ప్రక్రియ..

జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఆధార్ లేకపోవడం, బయోమెట్రిక్ కాకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను అప్రమత్తం చేయకపోవడంతో కేంద్రం తీసుకొచ్చిన యూడైస్‌లో విద్యార్థుల వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులకు పిన్‌నంబర్ జనరేట్ కాకపోవడంతో వివరాల ఆన్‌లైన్ నమోదులో ఆలస్యం జరుగుతోంది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే పూర్తిస్థాయిలో ఆధార్, బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉన్నా ఉన్నతాధికారుల నుంచి పెద్దగా ఒత్తిడి లేకపోవడంతో వివరాల నమోదులో ఆలస్యం జరుగుతోంది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసిన బీఆర్ఎస్
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



లబ్ధిదారుకు మిఠాయి తినిపిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వనపర్తి: రాష్ట్ర ఆవిర్భావ సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల కుప్పగా మార్చేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. శనివారం పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి హాజరై లబ్ధిదారులకు కొత్త దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల కాలంలో రూ.8.19 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపారని, ప్రజల దీవెనతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజామోద పాలన చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్, రూ.రెండు లక్షల వరకు పంట రుణమాఫీ వర్తింపజేశామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్న గత పాలకులు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని.. ప్రజాపాలనలో తొలి విడతగా రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని చెప్పారు. మరో మూడు విడతల్లో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. భూ భారతి చట్టంతో దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భరోసా కల్పించామన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం..

ఆర్థిక ఇబ్బందులున్నా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఉమ్మడి పాలమూరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని ప్రజా ప్రభుత్వం మరోసారి నిరూపించిందని.. గతంలోనూ వైఎస్సార్ హయాంలో ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.

పేదోడి సొంతింటి కల సాకారం..

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చుతామని రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రాష్ట్రంలో తొలి విడత నాలుగున్నర లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతనే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని మంత్రి పొంగులేటి మాట ఇచ్చారని.. అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే ఒకసారి రూ.వెయ్యి కోట్లు, మరోసారి రూ.280 కోట్లు మంజూరు చేశారని.. పనులు పురోగతిలో ఉన్నాయని గుర్తుచేశారు. అభివృద్ధిలో పాలేరు నియోజకవర్గం తర్వాత వనపర్తికి ప్రాధాన్యం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ ప్రాంతంలో గిరిజనులు అధికంగా ఉన్నందున ఇందిరమ్మ ఇళ్లు అదనంగా కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మం, సతీష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట రూరల్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ డెంగీ పరీక్షలు నిర్వహించాలని, ర్యాట్ పరీక్షలో పాజిటివ్ నిర్ధారణ అయితే రక్త నమూనాను ఎలిజా పరీక్షకు పంపించాలని వైద్యులకు సూచించారు. వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడంతో మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. జిల్లాలోని గురుకులాలు, సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీలు, అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులకు ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత, సమస్యలు ఉంటే ప్రతిపాదనలు అందించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం, గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, వైద్యాధికారులు ఉన్నారు.

నేడు రంగనాయకస్వామి ఆలయం మూసివేత

వనపర్తి రూరల్: చంద్ర గ్రహణం సందర్భంగా శ్రీరంగాపురంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం వరకు మూసి ఉంచనున్నట్లు ఆలయ అర్చకుడు విష్ణునారాయణ తెలిపారు. గ్రహణం ముగిసిన అనంతరం సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, అభిషేకం, పుణ్యాహ వాచనం తదితర పూజా కార్యక్రమాల తర్వాత ఉదయం 8 నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు.

చెరుకు రైతులను ఆదుకోవాలి

అమరచింత: చెరుకు కోతలకు సరిపడా కార్మికులను ముందస్తుగా రప్పించి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి శనివారం చెరుకు రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి చెరుకు రైతుసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ.. గత సీజన్‌లో ప్రకటించి అమలు చేస్తున్న రాయితీలను 2025–2026 సంవత్సరం కొనసాగించాలని, అధిక దిగుబడినిచ్చే వంగడాలను పరిచయం చేసి సాగుకు సహకరించాలన్నారు. చెరుకు రవాణాకు అనుకూలంగా ఉండేలా ట్రాక్టర్ ట్రాలీలు తయారు చేయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతులకు ఇవ్వాల్సిన షూ్యరిటీ డబ్బులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని, ప్రతి రైతుకు ఇన్‌వాయిస్ ఇచ్చేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో పంట డబ్బులు చెల్లించడం, రాయితీలు అందించడంతో మూడేళ్లుగా సాగు క్రమంగా పెరుగుతోందని.. ఇలానే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వాసారెడ్డి, రంగన్న, చంద్రసేనారెడ్డి, నారాయణ, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ యాజమాన్యానికి వినతిపత్రం అందజేస్తున్న చెరుకు రైతులు

వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన



జూరాల పుష్కరఘాట్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ ప్రాంతం నుంచి గద్వాలకు వెళ్లేందుకు వంతెన నిర్మాణానికిగాను స్థల పరిశీలన చేపడుతున్నట్లు నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ నాగేంద్రం తెలిపారు. శనివారం మండలంలోని జూరాల పుష్కరఘాట్, అమరచింత మండలం ప్రారంభం వద్ద వంతెన నిర్మాణాలకు అనువైన స్థలాలను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు స్థల పరిశీలన జరిపామన్నారు. ఇటీవల జూరాలను సందర్శించిన మంత్రులు వంతెన నిర్మాణానికి కావాల్సిన రూ.120 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. అందులో భాగంగానే సందర్శించామన్నారు. జూరాల వద్ద వంతెన నిర్మాణంతో ఆత్మకూర్, అమరచింత మండలాల నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని అధికారులు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, డీఈ నారాయణ, మార్కెట్ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ నాయకులు పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, మహమూద్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

యూరియా తిప్పలు తప్పేదెన్నడో..?



పాన్‌గల్ సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో రైతుల రద్దీ



ఆత్మకూర్ పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయానికి యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు శనివారం ఉదయమే భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆవరణ కిక్కిరిసిపోయింది. 600 బస్తాల యూరియా రాగా.. మూడురోజుల కిందట టోకన్లు తీసుకున్న రైతులు ఒకపక్క, టోకన్లు లేని రైతులు మరోపక్క పెద్ద సంఖ్యలో గుమిగూడారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి టోకన్లు, యూరియా పంపిణీ చేపట్టారు. మూడురోజుల కిందట పంపిణీ చేసిన టోకన్లలో ఇంకా 416 మందికి, కొత్తగా 390 మందికి టోకన్లు పంపిణీ చేయడంతో మొత్తం 806 మంది రైతులకు యూరియా ఇవ్వాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. రోజు యూరియా పంపిణీ చేస్తున్నా.. రైతుల రద్దీ మాత్రం తగ్గడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా.. యూరియా కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తీసుకొచ్చి రోడ్డుపైనే నిలపడంతో మీ–సేవా కేంద్రాలు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి కార్యాలయానికి నడిచి వెళ్లడం కనిపించింది.

ఆత్మకూర్: పట్టణంలోని పీఏసీఎస్‌కు శనివారం ఉదయమే వివిధ గ్రామాల రైతులు తరలివచ్చి చెప్పులు, పట్టాదారు పాసు పుస్తకాలను వరుసలో ఉంచి పడిగాపులు పడటం కనిపించింది. మధ్యాహ్నం 300 సంచుల యూరియారాగా పోలీసులు కలుగజేసుకొని రైతులను వరుస క్రమంలో నిలబెట్టి 140 మందికి 300 బస్తాలు పంపిణీ చేశారు. మిగిలిన 200 మంది రైతులకు టోకన్లు అందించామని.. సోమవారం యూరియా అందిస్తామని ఏఓ వినయ్‌కుమార్, సీఈఓ నరేష్ తెలిపారు.

'సర్వేపల్లి' జీవితం ఆదర్శం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తదితరులు

వనపర్తి: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లాను విద్యాపరంగా ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శం కావాలని.. తన పుట్టినరోజును టీచర్స్ డేగా జరుపుకోవాలని సూచించడం ఉపాధ్యాయులకు గొప్ప గౌరవం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని.. అందులో భాగంగానే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయులకు పదోన్నతులు, కొత్త టీచర్ల నియామకం చేపట్టిందని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తోందన్నారు. కొత్త విద్యా విధానం తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందన్నారు. జనాభా సర్వే, ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు పనిచేస్తే అందరికీ ఒక నమ్మకం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రెండు జిల్లాలను విద్యాపరంగా ఉత్తమ జిల్లాలుగా గుర్తించారని.. అందులో వనపర్తి లేకపోవడం బాధ కలిగించిందన్నారు. విద్యాపర్తిగా పేరున్న వనపర్తిని రానున్న రోజుల్లో చదువులో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు సృజనాత్మకత, నైతిక విలువలు నేర్పిస్తూ సమాజానికి మేలు చేసేలా తీర్చిదిద్దాలన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు బోధనతో పాటు శాస్త్రవేత్తల గురించి చెప్పి వారి మనసును ఆకర్షించాలని, అప్పుడే చదువుపై శ్రద్ధ చూపుతారని తెలిపారు. పోలీస్‌శాఖ నుంచి విద్యార్థులకు తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అంతకుముందు విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయానికి ప్రత్యేకంగా నిలిచిన బోనాల పండుగ ప్రత్యేక నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 63 మందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో పాటు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, యాదయ్య, జిల్లా విద్యాధికారి మహ్మద్ ఘనీ, ఏసీజీఈ గణేష్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో..


ప్రమోద్(ఫైల్)

జడ్చర్ల: గణేశ్ నిమజ్జన ఉత్సవంలో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. దేపల్లి త్రిశూల్‌నగర్‌కు చెందిన ప్రమోద్(24) మిత్రుడు ప్రభుకుమార్‌తో కలిసి బైక్‌పై నిమజ్జనంలో పాల్గొని సిగ్నల్‌గడ్డ వైపు నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్తున్న క్రమంలో చర్చి సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ప్రమోద్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ప్రభుకుమార్ గాయపడ్డాడు. ఒక్కగానొక్క కుమారుడు ప్రమోద్ మృతితో తల్లిదండ్రులు సావిత్రి, యాదయ్య కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వృద్ధుడి మృతి


గునగంటి బొజ్జయ్య (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: మతిస్థిమితం లేని వృద్ధుడు కెఎల్‌ఐ కాల్వలో పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీపురం గ్రామానికి చెందిన గునగంటి బొజ్జయ్య (65)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. గత నెల 28న కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో బొజ్జయ్య ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం శ్రీపురం గ్రామంలోని కేఎల్‌ఐ కాల్వలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతని కుమారుడు అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు


గాయపడిన బాలక్రిష్ణమ్మ

తిమ్మాజిపేట: వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని చేగుంట గ్రామంలో శనివారం జరిగింది. గడ్డం బాలక్రిష్ణమ్మ అనే వృద్ధురాలు శనివారం ఇంట్లో వంట చేసుకుంటుండగా కోతుల గుంపు ఇంట్లోకి దూరి ఆమెపై దాడి చేసింది. మెడ, వీపు, కాళ్లు, చేతులపై కరువగా కేకలు వేయడంతో భర్త మైబు కర్ర తీసుకురావడంతో కోతులు పారిపోయాయి. బాలక్రిష్ణమ్మ వెంటనే బిజినపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కోతుల బెడద ఎక్కువ కావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల నుంచి తమను రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఊరేగింపులో ఘర్షణ




ధరూరు: గణేశ్ నిమజ్జన ఊరేగింపులో జరిగిన ఘర్షణలో యువకుడు గాయపడిన ఘటన మండల పరిధిలోని ద్యాగదొడ్డిలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డీజే కోసం కిరాయికి తీసుకొచ్చిన బొలెరో డ్రైవర్ చంద్రశేఖర్ ముఖ్య కూడలి వద్ద వాహనం నిలిపి వాహనంలోనే నిద్రకు ఉపక్రమించాడు. నిద్రిస్తున్న డ్రైవర్‌ను డ్యాన్స్ చేయాలని యువకులు బలవంతం చేశారు. ఈ నేపథ్యంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో డ్రైవర్ చంద్రశేఖర్‌కు తలకు గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. శనివారం రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

యథేచ్ఛగా వసూళ్ల దందా?

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మారని తీరు

- ప్రతి పనికి ఓ రేటు
- దస్తావేజు లేఖరుల కనుసన్నల్లోనే..
- ఏసీబీ దాడులు జరుగుతున్నా.. మారని వైనం




ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

మెట్టుగడ్డ: ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలున్నా.. పైసలివ్వనిదే పని కావడం లేదు. డాక్యుమెంట్ ఛార్జీలతో పాటు కార్యాలయంలో ఇవ్వాలంటూ దస్తావేజు లేఖరులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. సాధారణంగా గ్రామకంఠం భూములకు సర్వేనంబర్లు ఉండవు. అసెస్‌మెంట్ నంబరు, గ్రామ పంచాయతీలో చెల్లించిన పన్ను రసీదు చూపితే రిజిస్ట్రేషన్ చేయాలి. తండ్రి నుంచి కుమారుడికి, భర్త నుంచి భార్యకు గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నాలా అయితే ఒక రేటు, అపార్ట్‌మెంట్, ఇళ్లు అయితే మరోరేటు.. ఇలా ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి దండుకున్నట్లు ఆరోపణలున్నాయి.

ఏసీబీ దాడులు జరుగుతున్నా..

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి అడ్డు లేకుండా పోయింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యాలయాలపై ఓ పక్క ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం విశేషం. ఫిర్యాదులతో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు ప్రారంభించగా.. దళారులను పెట్టుకొని దోపిడీ కొనసాగిస్తున్నారు. తాజాగా జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారుల వద్ద దొరికిన అదనపు సొమ్ములే ఇందుకు నిదర్శనం. అవసరాలను ఆసరా చేసుకొని క్రయ విక్రయదారుల జేబులను గుల్ల చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ విధానం అమలు చేయడంతో అనధికార ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడినట్లయింది. కానీ దీన్ని ఆసరా చేసుకొని కొందరు సబ్-రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా జీపీ లే అవుట్ల(అనధికార ప్లాట్లు)లో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలియడంతో మరోసారి ఏసీబీ అధికారులు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

డాక్యుమెంట్ రైటర్లే దళారులుగా మారి..?

ఉమ్మడి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెద్దఎత్తున దుకాణాలు తెరిచారు. వీరిలో చాలామంది అధికారులు, క్రయ విక్రయదారులకు దళారులుగా మారి అక్రమ వసూళ్లకు తెర లేపారు. పబ్లిక్ డాటా ఎంట్రీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం అమలులో ఉన్నప్పటికీ పాత పద్ధతిలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయంటేనే క్రయ విక్రయదారులు ఎంత దోపిడీకి గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు కొందరు డాక్యుమెంట్ రైటర్లకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ వారి ద్వారానే లావాదేవీలు కొనసాగిస్తున్నట్లు బాహాటంగా మాట్లాడుకుంటున్నారు.

కాసులు కురిపిస్తున్న ఈసీ, సీసీ..

ఆస్తుల లావాదేవీల్లో ఈసీ (ఎన్‌కంబెన్స్ సర్టిఫికేట్) కీలకం. ఈ ధ్రువపత్రం కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఈసీ కావాలంటే ప్రభుత్వ ఫీజు కంటే అదనపు రుసుం చెల్లించాల్సిందే. మాన్యువల్ ఈసీ కావాలంటే అడిగినంతా ఇచ్చుకోవాల్సిందే. డాక్యుమెంట్ల సీసీ (సర్టిఫైడ్ కాపీ) కావాలంటే ప్రభుత్వ ఫీజు కంటే రూ.300 అదనపు డబ్బు చెల్లించాల్సిందే. వివాహ రిజిస్ట్రేషన్లకు సైతం ప్రభుత్వ ఫీజు కంటే అదనంగా రూ.600 అదనంగా వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. ప్రతి పనికి ప్రభుత్వానికి చెల్లించిన రుసుంతో పాటు అదనపు దోపిడీ పక్కాగా జరుగుతోంది.

ఎలాంటి ఫిర్యాదులు లేవు..



ప్రజల నుంచి ప్రభుత్వ ఫీజు కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదుల స్వీకరణకు పెట్టె ఏర్పాటు చేశాం.. దానిలో వేయాలని సూచిస్తున్నాం. కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు. డాక్యుమెంట్ రైటర్లు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్రయ విక్రయదారులు కార్యాలయాల్లో కానీ, ఎవరైనా డబ్బు అడిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం.

– డి.ఫణీందర్, జిల్లా రిజిస్ట్రార్ (స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ)

ఉత్కంఠగా బ్యాడ్మింటన్ పోటీలు


డబుల్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లో తలబడుతున్న క్రీడాకారులు

- సింగిల్స్, డబుల్స్ మిక్స్‌డ్‌లో సెమీస్ మ్యాచ్‌లు
- నేటితో ముగియనున్న టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్-13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్కంఠగా కొనసాగుతోంది. అకాడమీ క్రీడాకారుల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. క్వార్టర్, సెమీ ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి.

హోరాహోరీగా సెమీస్

శనివారం బాలుర, బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర సింగిల్స్ మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో పబ్బు శివాన్ష్ (మేడ్చల్- మల్కాజ్‌గిరి) 15-11, 15-10 సెట్ల తేడాతో అద్వాత్ సత్తు (వికారాబాద్)పై, రెండో సెమీస్‌లో కంజుల జస్ప్రీత్ (వరంగల్) 15-9, 15-11 సెట్ల తేడాతో రామ్ చరణ్ తేజ ఆకుల (మేడ్చల్ మల్కాజ్‌గిరి)పై, బాలికల సింగిల్స్ మొదటి సెమీ ఫైనల్‌లో నిమ్మ శాన్వి (సంగారెడ్డి) 15-10, 15-12 పాయింట్ల తేడాతో దియా ఆనంద్ (వికారాబాద్)పై, రెండో సెమీస్‌లో అనుముల శ్రీవైభవి(నిజామాబాద్) 15-11, 8-15, 15-11 పాయింట్ల తేడాతో మనస్విని భూక్య (వరంగల్)పై గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నారు.


డబుల్స్‌లో సెమీఫైనల్ మ్యాచ్‌లు

బాలుర డబుల్స్ విభాగం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కార్తికేయ మహర్షి (రంగారెడ్డి), శివాన్ష్ (మేడ్చల్, మల్కాజ్‌గిరి) 16-14, 15-12 సెట్ల తేడాతో అద్వైత్ సత్తు- సుహిత్‌యాదవ్ (వికారాబాద్)పై, రెండో సెమీస్‌లో రామ్‌చరణ్‌తేజ (మేడ్చల్, మల్కాజ్‌గిరి)- శౌర్యప్రతాప్‌సింగ్ (మేడ్చల్, మల్కాజ్‌గిరి) 15-12, 15-5 సెట్ల తేడాతో అభిషిక్త్ (కరీంనగర్)- కంజుల జస్ప్రీత్(వరంగల్)పై, బాలికల డబుల్స్ విభాగం మొదటి సెమీ ఫైనల్‌లో అభాజాదవ్ (రంగారెడ్డి)- దియా ఆనంద్ (వికారాబాద్) 17-15, 15-7 పాయింట్ల తేడాతో భూషణ్ త్రినితి (వికారాబాద్)- గాదె అన్విరెడ్డి (సూర్యాపేట)పై, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో దీక్ష సహస్ర బండ (మహబూబ్‌నగర్)- నిమ్మ శాన్వి(సంగారెడ్డి) 8-15, 15-13, 12-15 తేడాతో లోష్య కోరుకొండ (వికారాబాద్)- మనస్విని భూక్య (వరంగల్)పై గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నారు.

నేడు ముగింపు వేడుకలు

రాష్ట్రస్థాయి అండర్-13 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లు, ముగింపు వేడుకలు నేడు ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. గెలుపొందిన వారికి ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద


శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

- 1,10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- 8 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 76,800 క్యూసెక్కుల వరద రాగా.. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 1,10,500 క్యూసెక్కులకు పెరిగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్ట్ 8 క్రస్ట్‌గేట్లు ఎత్తి 56,648 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నామని.. విద్యుదుద్పత్తి నిమిత్తం 40,978 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 700, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.969 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

606 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది. శనివారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 289.616 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 316.385 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఇప్పటి వరకు రెండు కేంద్రాల్లో 606.001 మి.యూ. విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

శ్రీశైలం జలాశయం ఒక గేటు ఎత్తి..

శ్రీశైలం ఆనకట్ట వద్ద శనివారం ఒక గేటు పైకెత్తి దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల స్పిల్‌వే ద్వారా 56,648 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 40,978 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 35,832 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. ఆనకట్ట ఒక గేట్ పది అడుగుల మేర పైకెత్తి 27,662 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,665 క్యూసెక్కులు అదనంగా విడుదలవుతున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 884.1 అడుగుల నీటిమట్టం.. 210.5133 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో 16.973 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.265 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

గణేశుడి లడ్డును దక్కించుకున్న ముస్లిం


వేలంలో దక్కించుకున్న లడ్డుతో ఎండీ పాషా

మక్తల్: మండలంలోని ముస్టిపల్లి గ్రామంలో గణేశ్ ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి లడ్డు వేలం నిర్వహించగా ముస్లిం వ్యక్తి దక్కించుకున్నాడు. వేలంలో దాదాపు 10 మంది పాల్గొనగా గ్రామానికి చెందిన ఎండీ పాషా రూ.26,116కు లడ్డును దక్కించుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. ఉత్సవాల్లో ముస్లిం వ్యక్తి భాగం కావడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్రామంలో ప్రతిష్ఠించిన గణేశుడి దగ్గర అతడు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం విశేషం. దీంతో ఎండీ పాషాను గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు అభినందించారు.

శ్రీశైలం రహదారిలో ట్రాఫిక్ జామ్


దోమలపెంట సమీపంలో నిలిచిన వాహనాలు


ఈగలపెంట వద్ద రెండు టైర్లు పేలిపోవడంతో నిలిచిన ఆర్టీసీ బస్సు

దోమలపెంట: శ్రీశైలం రహదారిపై శనివారం వాహనాల రద్దీ పెరిగింది. దోమలపెంట నుంచి శ్రీశైలం వరకు వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. మరోవైపు ఈగలపెంట సమీపంలో ఓ బస్సు ముందు టైర్లు పంక్చర్ కావడంతో రోడ్డుపైనే నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలన్నీ స్తంభించిపోయాయి. ఈగలపెంట ఎస్‌ఐ అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. 10 నిమిషాలు పైకి వచ్చే వాహనాలకు, మరో 10 నిమిషాలు దిగువకు వెళ్లే వాహనాలకు అనుమతులిచ్చారు. కానీ ముందుగానే బస్సు వెనుక భాగం నుంచి దోమలపెంట వరకు వాహనాలు నిలిచి ఉండటం.. మరోవైపు శ్రీశైలం దేవస్థానం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు బారులు తీరారు. ట్రాఫిక్ క్లియర్ కావడానికి సుమారు 4గంటల సమయం పట్టింది.

తప్పిన ప్రమాదం..

హైదరాబాద్ నుంచి శ్రీశైల క్షేత్రం వెళ్తున్న పికెట్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సుకు ప్రమాదం తప్పింది. ఈగలపెంట వద్ద ప్రయాణిస్తున్న బస్సు ముందు టైర్లు ఒక్కసారిగా పేలిపోయాయి. బస్సు డ్రైవర్ యాదగిరి చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. మరో 100మీటర్ల దూరంలో ఘాట్‌రోడ్డు ఉండటం.. ఆ ప్రాంతంలో బస్సు టైర్లు పేలి ఉంటే పెను ప్రమాదం జరిగేది. బస్సులోని ప్రయాణికుల మరో బస్సులో శ్రీశైలం బయల్దేరి వెళ్లారు.

మార్కెట్‌లోకి రెనాల్ట్ కిగర్ టర్బో



మార్కెట్‌లోకి రెనాల్ట్ కిగర్ టర్బో కారును విడుదల చేస్తున్న మేనేజర్ మాధురి, ఎండీ శ్రీహర్షిత్‌రెడ్డి

పాలమూరు: రెనాల్ట్ కంపెనీ నుంచి మరో న్యూ మోడల్ కారు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని యుక్తా మోటార్స్‌లో శనివారం రెనాల్ట్ కిగర్ టర్బో కారును కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ మాధురి, ట్రెండ్ గ్రూప్ ఎండీ గట్టు శ్రీహర్షిత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. నూతన టర్బోలో ఎనర్జీ ఇంజిన్ కలిగి.. సరికొత్త భద్రతా ప్రమాణాలతో ఆరు ఎయిర్ బ్యాగ్స్ ఉన్నాయని తెలిపారు. క్రూజ్ కంట్రోల్ సిస్టంతో గ్రామీణ రోడ్లపై అనుకూలంగా వెళ్తుందన్నారు. గ్రౌండ్ క్లియరెన్స్ కలిగి.. మల్టీవ్యూ కెమెరా, ఆటో హెడ్‌ల్యాంప్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్ ఉన్నాయని తెలిపారు. 40.64 సెంటీమీటర్ల డైమండ్ కట్ అలాయ్ వీల్స్‌తో ఆరు రంగుల్లో పెట్రోల్ వెర్షన్‌తో అందుబాటులో ఉందన్నారు. లీటర్ 20.38 కి.మీ. మైలేజ్ ఇస్తోందని తెలిపారు. ఎక్స్‌షోరూం ధర రూ. 6.29లక్షలు ఉందన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ రమేశ్, సర్వీస్ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

యువకుల వీరంగం

రాళ్లు, కర్రలతో దాడి : ముగ్గురికి గాయాలు


గాయపడిన తాజా మాజీ కౌన్సిలర్ మహేశ్


గాయపడిన శ్రీనివాసులు

గద్వాల క్రైం: మద్యం మత్తులో యువకులు చేసిన వీరంగంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం తెల్లవారుజామున గద్వాలలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని చింతలపేటకాలనీకి చెందిన రఫీ, నవీన్, నర్సింహ మద్యం కొనుగోలుకు శుక్రవారం రాత్రి హట్కర్‌పేటకాలనీలో ఉన్న బెల్ట్ దుకాణానికి వెళ్లారు. అప్పటికే అంబేడ్కర్‌నగర్‌కాలనీకి చెందిన రంజిత్ సైతం మద్యం కొనుగోలుకు వేచి ఉన్నాడు. మద్యం మత్తులో ఉన్న యువకులు రంజిత్‌తో అకారణంగా ఘర్షణ పడగా తోటి స్నేహితులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని ముగ్గురు యువకులను మందలించగా గొడవ సద్దుమణిగింది. గొడవ జరిగిన విషయం తెలుసుకున్న ఆ కాలనీ మాజీ తాజా కౌన్సిలర్ మహేశ్ అర్ధరాత్రి 12 గంటల సమయంలో సదరు యువకులను అంబేడ్కర్‌నగర్ వినాయక మండపాం వద్ద గమనించి గొడవకు గల కారణాలు తెలుసుకొని వారిని ఇళ్లకు పంపించారు. శనివారం తెల్లవారుజామున అంబేడ్కర్‌కాలనీ ఎంబీ మిస్పా చర్చి సమీపంలో తాజా మాజీ కౌన్సిలర్ మహేశ్‌ను చూసిన రఫీ, నవీన్, నర్సింహ మరికొందరితో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేయగా కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న మహేశ్ తండ్రి శ్రీనివాసులు, వినయ్ గమనించి అక్కడకు చేరుకొని నిలువారించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ దాడిలో మహేష్, శ్రీనివాసులు, వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాలనీవాసులు యువకులను పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పరారయ్యారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ తాజా మున్సిపల్ చైర్‌పర్సన్ కేశవ్, నాయకులు బాధితులను పరామర్శించారు. బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు.

డిండి కెనాల్‌లో బాలయ్య తల లభ్యం


డిండి కాల్వ వద్ద బాలయ్య తలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కల్వకుర్తి టౌన్: కొడుకు చేతిలో హత్యకు గురైన బాలయ్య తల హత్య చేసిన మూడు రోజులకు లభ్యమైంది. శుక్రవారం రాత్రి సమయంలో అతని మృతదేహం లభ్యం కాగా, శరీరానికి తల లేకపోవటంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉప్పునుంతల మండలం కొరటికల్ వద్ద వాగులో లభ్యమైన మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించి, అక్కడే మార్చురీలో ఉంచారు. తల కోసం గాలిస్తున్న పోలీసులకు వంగూర్ మండలం డిండి చింతపల్లి వద్ద గజ ఈతగాళ్లతో వెతుకుతుండగా, అక్కడే ఉన్న ఓ సబ్‌కెనాల్‌లో తల లభ్యమైనట్లుగా పోలీసులు తెలిపారు. తలను గుర్తించి దానిని సీహెచ్‌సీ మార్చురీకి తరలించి, వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు సంబంధించి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాలయ్య కుటుంబాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పట్టణంలోని సీహెచ్‌సీలో పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి తదుపరి చర్యలపై ఆరా తీశారు.